గవర్నర్ తమిళిసై రాజీనామా

మొదటిపేజీ తరువాయి...

రాజ్యాంగబద్ధంగానే వ్యవహరించినప్పటికీ ఆ తర్వాత మాత్రం తనలోని బీజేపీ నాయకురాలిని బయటకు తీసినట్టు విమర్శలున్నాయి. బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని టార్గెట్‌గా చేసుకుని రాజ్‌భవన్‌ను వివాదాలకు కేరాఫ్‌గా మార్చేశారన్న అపవాదు కూడా ఉంది. బీఆర్ఎస్‌పై కక్ష గట్టి అందుకు అనుగుణంగా పనిచేశారన్న ప్రచారం కూడా జరుగుతున్నది. ఆమె రాజీనామా తర్వాత సోషల్ మీడియాలోనూ సెటైర్లు పేలుతున్నాయి. 'టాస్క్ కంప్లీటెడ్.. ఎగ్జిట్' అని క్యాప్షన్లు తగిలిస్తూ.. అప్పగించిన పని పూర్తికావడంతో ఆమె వెళ్లిపోతున్నారన్న చర్చ జరుగుతున్నది. బీఆర్ఎస్‌ను ఓడించే టార్గెట్‌ను ఆమెకు అప్పగించారని, పని పూర్తికావడంతో ఆమె తిరిగి వెళ్లిపోతున్నారన్న ప్రచారం ఊపందుకున్నది. అందుకు అనుగుణంగానే ఆమె ప్రవర్తన ఉండేదని గుర్తుచేసుకుంటున్నారు. పలు సందర్భాల్లో ఆమె ప్రత్యక్షంగా, పరోక్షంగా బీఆర్ఎస్‌పైనా, కేసీఆర్‌పైనా తీవ్ర విమర్శలు గుప్పించారు. వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. క్యాబినెట్ ఆమోదం లేకుండానే ప్రసంగాలు చేశారు. ప్రొటోకాల్ పేరుతో పెద్ద రచ్చ చేశారు. చిన్న విషయాలను కూడా వివాదాస్పదంగా మార్చేశారన్న విమర్శలున్నాయి.

ప్రగతి నిరోధక చర్యలు

ప్రభుత్వ పంపిన బిల్లులకు, ప్రతిపాదనలకు ఆమోదం తెలపకుండా పెండింగ్‌లో పెట్టడంతోపాటు కొన్నింటిని తిరస్కరించడం ద్వారా ప్రగతి నిరోధక చర్యలకు పాల్పడ్డారన్న ఆరోపణలు కూడా తమిళిసైపై ఉన్నాయి. మరీ ముఖ్యంగా గవర్నర్ కోటా ఎమ్మెల్సీల నియామకం విషయంలో ఆమె తన పరిధి దాటి వ్యవహరించారనే విమర్శలు వెల్లువెత్తాయి. అప్పటి క్యాబినెట్, శాసనసభ ఆమోదంతో పంపిన 10 బిల్లులను నెలలపాటు పెండింగులో పెట్టారు. గవర్నర్ తీరుతో చివరికి సుప్రీంకోర్టును ఆశ్రయించాల్సి వచ్చింది. సుప్రీం ఆదేశాలతో కొన్ని బిల్లులకు ఆమోదం తెలిపిన తమిళిసై మరికొన్ని బిల్లలను మాత్రం తిరస్కరించారు. నామినేటెడ్ ఎమ్మెల్సీల విషయంలోనూ ఆమె కక్షపూరితంగా వ్యవహరించారనే విమర్శలున్నాయి. నాడు గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీగా పాడి కౌశిక్‌రెడ్డిని క్యాబినెట్ నామినేట్ చేసి గవర్నర్‌కు పంపితే, రెండు నెలల వరకు ఆమోదం తెలుపకుండా పెండింగ్‌లో పెట్టారు. ఆ తర్వాత తిరస్కరించడంతో ఎమ్మెల్యే కోటాలో ఆయనను ఎమ్మెల్సీ చేయాల్సి వచ్చింది.

దాసోజు, కుర్రా విషయంలోనూ అంతే

బీఆర్ఎస్ నేతలు దాసోజు శ్రవణ్, కుర్రా సత్యనారాయణ విషయంలోనూ గవర్నర్ ఇలానే రాజ్యంగ విరుద్ధంగా వ్యవహరించారన్న ఆరోపణలున్నాయి. గత సెప్టెంబర్‌లో గవర్నర్ కోటాలో దాసోజు శ్రవణ్, కుర్రా సత్యనారాయణను ఎమ్మెల్సీలుగా ప్రతిపాదిస్తూ గవర్నర్‌కు ఫైలు పంపింది. దీనికి పలు కారణాలను సాకుగా చూపి తిరస్కరించారు. గవర్నర్ తీరుపై వారిద్దరూ హైకోర్టును ఆశ్రయించారు. మంత్రిమండలి సిఫార్సులను తిరస్కరించే అధికారం గవర్నర్‌కు లేదని, ఫైలును పునఃపరిశీలించాలని గవర్నర్‌కు హైకోర్టు సూచించింది. కోర్టు సూచనలను పెడచెవిన పెట్టిన తమిళిసై ఎలాంటి నిర్ణయం తీసుకోకుండా బడుగు, బలహీన వర్గాలకు చెందిన ఇద్దరు ఎమ్మెల్సీలు కాకుండా అడ్డుకున్నారు.

బీజేపీ నాయకురాలిలా

తమిళిసై తెలంగాణకు గవర్నర్‌గా రాకముందు వరకు బీజేపీ తమిళనాడు అధ్యక్షురాలిగా వ్యవహరించారు. గవర్నర్ అయ్యాక కూడా ఆమె తన రాజకీయ అలవాట్లను మార్చుకోలేకపోయారు. రాజ్యాంగబద్ధ పదవిలో ఉంటూ బీజేపీ నాయకురాలిలా వ్యవహరించారనే విమర్శలు వెల్లువెత్తాయి. ఆమె వ్యవహారశైలిపై పలువురు అనుమానం వ్యక్తం చేశారు.

మళ్లీ ప్రత్యక్ష రాజకీయాల్లోకి!

గవర్నర్‌గా తన పదవికి రాజీనామా చేసిన తమిళిసై సౌందరరాజన్ తమిళనాడు నుంచి మళ్లీ ప్రత్యక్ష రాజకీయాల్లోకి రాజకీయాల్లోకి రాబోతున్నట్టు జోరుగా ప్రచారం జరుగుతున్నది. చెన్నై సెంట్రల్ నుంచి లోక్‌సభ ఎన్నికల బరిలోకి దిగనున్నట్టు సమాచారం. రాజ్యాంగబద్ధమైన గవర్నర్ పదవి చేపట్టిన తర్వాత తిరిగి ప్రత్యక్ష రాజకీయాల్లోకి రావడంపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. గవర్నర్‌గా పనిచేశాక మళ్లీ ఎన్నికల్లో పోటీ నైతికత కాదని చెప్తున్నారు.

ప్రజాసేవ కోసం తిరిగి వెళ్తున్నా: తమిళిసై

గవర్నర్ పదవికి రాజీనామా చేయడంపై తమిళిసై సౌందరరాజన్ స్పందించారు. ప్రజాసేవ కోసం తిరిగి వెళ్తున్నట్టు తెలిపారు. తెలంగాణ ప్రజలపై తన ప్రేమ చిరస్థాయిగా ఉంటుందని, చిరస్మణీయమైన జ్ఞాపకాలతో తెలంగాణను వీడుతున్నట్టు పేర్కొన్నారు. తెలంగాణలోని సోదర సోదరీమణుల ఆప్యాయత తనను ఎంతగానో ఆకట్టుకున్నదని తెలిపారు.

ఏపీ గవర్నర్‌కు తెలంగాణ బాధ్యతలు!

తెలంగాణ గవర్నర్ పదవికి తమిళిసై రాజీనామా చేయడంతో ఆ బాధ్యతలను ఏపీ గవర్నర్ అబ్దుల్ నజీర్‌కు కేంద్రం అప్పగించినట్టు తెలిసింది. లోక్‌సభ ఎన్నికల నోటిఫికేషన్ వెలువడిన నేపథ్యంలో కొత్త గవర్నర్‌ను నియమించే అవకాశం లేదు. ఈ నేపథ్యంలో ఏపీ గవర్నర్‌కు బాధ్యతలు అప్పగించినట్టు తెలిసింది.

పెండ్లి బరాత్‌లో డ్యాన్స్ చేస్తుండగా..

గుండెపోటుతో యువకుడి మృతి

పెద్దపల్లి జిల్లా కొలనూర్‌లో ఘటన

విజయ్‌కుమార్ (ఫైల్)

ఓదెల, మార్చి 18: పెండ్లి బరాత్‌లో డ్యాన్స్ చేస్తూ ఓ యువకుడు గుండెపోటుతో కుప్పకూలాడు. వెంటనే స్థానికులు దవాఖానకు తరలించినా అప్పటికే మృత్యువాత పడ్డాడు. ఈ విషాద ఘటన ఆదివారం రాత్రి పెద్దపల్లి జిల్లా ఓదెల మండలం కొలనూర్‌లో జరిగింది. కరీంనగర్ మండలం తీగలగుట్టపల్లికి చెందిన విజయ్‌కుమార్ (33) పెద్దపల్లి జిల్లా ఓదెల మండలం హరిపురంలోని స్నేహితుడి పెండ్లి విందు వేడుకలో పాల్గొనడానికి ఆదివారం సాయంత్రం వచ్చాడు. విందు అనంతరం ఇదే మండలంలోని కొలనూర్‌లో విజయ్‌కుమార్ మిత్రుడి పెండ్లి బరాత్‌కు హాజరయ్యాడు. ఇందులో గంటల తరబడి డ్యాన్స్ చేస్తూ అర్ధరాత్రి ఒక్కసారిగా కుప్పకూలాడు. స్థానికులు వెంటనే దవాఖానకు తరలించగా.. అప్పటికే గుండెపోటుతో మృతి చెందినట్టు వైద్యులు తెలిపారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు పొత్కపల్లి ఎస్సై అశోక్‌రెడ్డి తెలిపారు.

ఆటో నడవక.. పూట గడవక..

మొదటిపేజీ తరువాయి...

అప్పులు కట్టలేక, ఆటో నడవక ఫైనాన్స్ కిస్తీలు చెల్లించే పరిస్థితి లేక తీవ్ర మనస్తాపానికి గురయ్యాడు. జీవితంపై విరక్తితో శంకరయ్య ఈ నెల 15వ తేదీ రాత్రి 8 గంటలకు బయటకు వెళ్లి వస్తానని ఆటో తీసుకొని వెళ్లాడు. మండలంలోని నాగులమ్మ–మల్లారం వెళ్లే ప్రధాన రహదారి అటవీ మార్గంలో ఆటోను రోడ్డు పక్కన నిలిపి గడ్డిమందు తాగాడు. కొద్దిసేపటికి వాంతులు కావడంతో కుటుంబసభ్యులకు ఫోన్‌చేసి సమాచారం అందించగా వెంటనే ఘటన స్థలానికి చేరుకొని భూపాలపల్లి ప్రభుత్వ దవాఖానకు తరలించారు. మెరుగైన వైద్యం కోసం వరంగల్‌లోని ఎంజీఎం దవాఖానకు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి తుదిశ్వాస విడిచాడు. మృతుడికి భార్య లక్ష్మి, ముగ్గురు కుమారులు ఉన్నారు. మృతుడి కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మా భవిష్యత్ బుగ్గిపాల్జేసినా.. మీరు గెలువాలి!

- మీ రాజకీయ జీవితం బాగుండాలి
- మాజీ గవర్నర్ తమిళిసై సౌందరరాజన్‌కు దాసోజు, కుర్రా బహిరంగ లేఖ

హైదరాబాద్, మార్చి 18 (నమస్తే తెలంగాణ): 'మా రాజకీయ భవిష్యత్తును బుగ్గిపాలు చేసినా, మీ రాజకీయ జీవితం మాత్రం బాగుండాలి' అంటూ మాజీ గవర్నర్ తమిళిసై సౌందరరాజన్‌కు బీఆర్ఎస్ నేతలు దాసోజ శ్రవణ్, కుర్రా సత్య సత్యనారాయణ సోమవారం బహిరంగ లేఖ రాశారు. 'అమ్మా.. గౌరవనీయులైన మాజీ గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ గారూ'.. అని మొదలుపెట్టిన ఆ లేఖలో 'మీ అపరిపక్వ, తప్పుడు నిర్ణయాలతో బడుగుబలహీన వర్గానికి చెందిన మా రాజకీయ భవిష్యత్తును బుగ్గిపాలు చేశారు. మా రాజకీయ జీవితాన్ని ఆగం చేసినా, మీరు మాత్రం వచ్చే ఎన్నికల్లో విజయం సాధించాలని కోరుకుంటున్నాం. రాజకీయాల్లో మీకున్న విస్తృత అనుభవం లక్ష్యాన్ని చేరుకునేందుకు తోడ్పడుతుందని ఆశిస్తున్నాం. హైకోర్టు ఆదేశాల తర్వాతనైనా చేసిన తప్పును సరిదిద్దుకొని శాసనమండలి సభ్యులుగా మమ్మల్ని నియమిస్తారని ఎంతగానో ఎదురుచూశాం. అయినప్పటికీ మా విజ్ఞప్తులను పట్టించుకోలేదు. అపరిపక్వ, తప్పుడు న్యాయ సలహాపై ఆధారపడి తీసుకున్న వివాదాస్పద రాజ్యాంగ వ్యతిరేక నిర్ణయం కారణంగా బడుగులమైన మాకు, మా కుటుంబాలకు తీరని అన్యాయం జరిగింది. గత ప్రభుత్వంపై ఉన్న శత్రుత్వంతో మాకు రాజకీయ నేపథ్యం ఉన్నదన్న కుంటిసాకును చూపించి మా త్యాగాలు, అర్హతలు, సమాజానికి మేం చేసిన కృషిని విస్మరించి మా రాజకీయ భవిష్యత్తును కాలరాశారు. మేం చాలా అట్టడుగు, అణచివేతకు గురైన వర్గాల నుంచి వచ్చామనే విషయాన్ని విస్మరించి, రాజ్యాంగాన్ని తప్పుదారి పట్టిస్తూ, చట్టవిరుద్ధమైన నిర్ణయంతో మా జీవితాలు నాశనం చేశారు. ఈ విషయాలన్నీ ఆత్మశోధన చేసుకోవాలి. మీ తప్పుడు నిర్ణయం వల్ల మా జీవితాలు నాశనం అయినప్పటికీ, మీరు మాత్రం రాజకీయ జీవితంలో విజయం సాధించాలని కోరుకుంటున్నాం' అని ఆ లేఖలో పేర్కొన్నారు.

మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌పై తప్పుడు ప్రచారం : డీకే అరుణ

మహబూబ్‌నగర్ అర్బన్, మార్చి 18 : మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ కమలం పార్టీలో చేరుతున్నట్టు అధికార, ప్రతిపక్షాల నాయకులు సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం చేస్తున్నారని బీజేపీ మహబూబ్‌నగర్ ఎంపీ అభ్యర్థి డీకే అరుణ ధ్వజమెత్తారు. సోమవారం జిల్లా కేంద్రంలోని తన నివాసంలో మీడియాతో మాట్లాడుతూ.. పనిగట్టుకుని ఒక నేతను ఇరుకున పెట్టేందుకే ఇలాంటి ప్రచారాలు చేస్తున్నారని విమర్శించారు. మాజీ ఎంపీ జితేందర్‌రెడ్డి వల్లే బీజేపీని ముఖ్యనాయకులు వీడారాని తెలిపారు. పార్టీలు మారే వ్యక్తి ఇప్పుడు కమలం పార్టీని విమర్శించడం ప్రజలు గమనిస్తున్నారని చెప్పారు.

కాంగ్రెస్‌కు ఏటీఎంగా తెలంగాణ

- తెలంగాణను కాంగ్రెస్ 60 ఏండ్లు దోచుకున్నది
- కాంగ్రెస్ అగ్రనేతల ఖజానాలకు తెలంగాణ సొమ్ము
- ఆ దోపిడీ సొమ్ముతోనే ఈ ఎన్నికల్లో వినియోగిస్తున్నది
- కుటుంబ పార్టీలు ఎక్కడుంటే అక్కడ కుంభకోణాలే
- 12 లక్షల మందికి గ్యాస్, రైతులకు మద్దతు ధర ఇచ్చాం
- బీజేపీకి మద్దతునిస్తూ ఘన విజయాన్ని అందించండి
- జగిత్యాల విజయసంకల్ప సభలో ప్రధాని మోదీ

జగిత్యాల సభలో ప్రసంగిస్తున్న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ

జగిత్యాల, మార్చి 18, (నమస్తే తెలంగాణ)/జగిత్యాల టౌన్/జగిత్యాల రూరల్: తెలంగాణను 60 ఏండ్ల పాటు కాంగ్రెస్ పార్టీ దోచుకున్నదని ప్రధాని నరేంద్ర మోదీ ఆరోపించారు. జగిత్యాల జిల్లా కేంద్రంలోని గీతా విద్యాలయ క్రీడా మైదానంలో సోమవారం బీజేపీ నిర్వహించిన విజయ సంకల్ప సభలో మోదీ మాట్లాడారు. ఇక్కడి ప్రజల ఆశలన్నింటినీ కాంగ్రెస్ పార్టీ కూల్చివేసిందని చెప్పారు. ఇప్పుడు మరోసారి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ మళ్లీ ప్రజాధనాన్ని దోచుకునే పనిని మొదలుపెట్టిందని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీకి తెలంగాణ ఏటీఎం మిషన్‌గా మారిందని, ఇక్కడి ప్రజల సొమ్ము ఢిల్లీలో కాంగ్రెస్ పార్టీ కుటుంబసభ్యుల ఖజానాల్లోకి చేరుతున్నదని చెప్పారు. అధికారంలోకి వచ్చాక కాంగ్రెస్ ప్రభుత్వం కాళేశ్వరం అవినీతిని ఎందుకు వెలికితీయడం లేదో ఒక్కసారి ఆలోచించాలని అన్నారు. కాంగ్రెస్ పార్టీ అలవిగాని హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిందని, అధికారంలోకి వచ్చాక వాటిని అమలు చేయడం లేదని మండిపడ్డారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు మోదీని విమర్శిస్తాయని, కానీ భారత్‌మాతాకీ జై అని ఇద్దరు ఎందుకు నినదించడం లేదని ప్రశ్నించారు. దేశంలో అనేక కుటుంబ పార్టీలు ఉన్నాయని, వాటి అంతిమ లక్ష్యం ప్రజలను లూటీ చేయడమేనని కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలను ఎంత దూరంగా ఉంచితే తెలంగాణ ప్రజలకు అంత మంచి జరుగుతుందన్నారు.

వినాశకులకు, రక్షకులకు మధ్య పోరాటం

లోక్‌సభ ఎన్నికలు శక్తి వ్యతిరేకులైన ఇండియా కూటమికి, శక్తి స్వరూప రక్షకులైన బీజేపీ కూటమికి మధ్య జరిగే పోరాటమని ప్రధాని మోదీ అభివర్ణించారు. మే 13న జరిగే పోలింగ్‌లో తెలంగాణ రాష్ట్రం కొత్త చరిత్రను రాయబోతున్నదని అన్నారు. తెలంగాణలో బీజేపీకి రోజురోజుకూ ప్రజాదరణ పెరుగుతున్నదని, జగిత్యాల సభకు హాజరైన జనసందోహమే అందుకు నిదర్శనమని చెప్పారు. దేశంలోని మహిళలందరూ శక్తి స్వరూపులేనని అందుకే శక్తి వందన బిల్లును ప్రవేశపెట్టామని అన్నారు. ఇండియా కూటమి శక్తి వ్యతిరేక విధానాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని చెప్పారు. శక్తి స్వరూప వ్యతిరేకుల నుంచి మహిళలను రక్షించేందుకు శక్తివంచన లేకుండా పోరాడుతానని తెలిపారు. శక్తి స్వరూపులైన మహిళల వినాశనం కోరుతూ ఇండియా కూటమి వస్తున్నదని వారికి అవకాశం ఇస్తారా..? అని ప్రశ్నించారు.

తెలంగాణలో ఎంతో అభివృద్ధి

పదేండ్లలో భారతదేశాన్ని బీజేపీ ప్రభుత్వం అన్ని విధాలుగా అభివృద్ధి పథంలో నడిపించిందని మోదీ చెప్పారు. 25 కోట్ల మంది భారతీయులను దారిద్ర్యరేఖ దిగువ నుంచి బయటకు తీసుకొచ్చామన్నారు. తెలంగాణలో కూడా అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని తెలిపారు. 12 లక్షల కుటుంబాలకు గ్యాస్ కనెక్షన్లు అందించామని, తెలంగాణలో ఉత్పత్తి అయిన ధాన్యాన్ని మద్దతు ధర ఇచ్చి కొనుగోలు చేశామని చెప్పారు. 2019లో ఇచ్చిన హామీ ప్రకారం పసుపు బోర్డును మంజూరు చేశామన్నారు. ఎన్డీయే ప్రభుత్వం మూలనపడిన రామగుండం ఎరువుల కర్మాగారాన్ని పునరుద్ధరించిందని చెప్పారు. జూన్ 2 నాటికి తెలంగాణ ఉద్భవించి పదేండ్లు అవుతుందని, జూన్ 4న వచ్చే ఫలితాల్లో తెలంగాణ ప్రజలు మోదీకి మద్దతు పలుకుతూ ఘన విజయాన్ని అందించాలని కోరారు. సమావేశంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి జీ కిషన్‌రెడ్డి, జాతీయ కార్యదర్శి బండి సంజయ్, నిజమాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్, ఎమ్మెల్యేలు మహేశ్వర్‌రెడ్డి, రాకేశ్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే బొడిగె శోభ, బీజేపీ జగిత్యాల జిల్లా శాఖ అధ్యక్షుడు పైడిపెల్లి సత్యనారాయణరావు, బోగ శ్రావణి తదితరులు పాల్గొన్నారు.

సగం టికెట్లు 'గోపి'లకే!

- బీజేపీ తీరుపై నేతల అసంతృప్తి
- పారాచ్యూట్ నేతలకే 90% టికెట్లు
- పార్టీని నమ్ముకున్నోళ్లకు రిక్తహస్తం

హైదరాబాద్, మార్చి 18 (నమస్తే తెలంగాణ): రండి.. పార్టీలో చేరండి.. టికెట్లు పుచ్చుకోండి.. బీజేపీలో ప్రస్తుతం ఇదే జరుగుతున్నది. రాష్ట్రంలోని 17 లోక్‌సభ స్థానాలకుగాను బీజేపీ ఇప్పటి వరకు 15 స్థానాలకు అభ్యర్థులను ప్రకటించింది. వీరిలో ఏడుగురు జంపింగ్ నేతలే. వారంతా ఇటీవల కాషాయ కండువా కప్పుకొని బీజేపీ నేతలుగా మారారు. ఆ వెంటనే టికెట్ అందుకుని పోటీకి రెడీ అయ్యారు. దీనినిబట్టి బీజేపీ టికెట్లు అందుకున్న వారిలో సగం మంది 'గోపి' (గోడమీద పిల్లి)లేనని రాజకీయ విశ్లేషకులు చెప్తున్నారు. మిగతా వారిలోనూ ముగ్గురు మాత్రమే ఏండ్ల తరబడి పార్టీని నమ్ముకుని ఉన్నారు. అంటే దాదాపు 90 శాతం టికెట్లు పారాచ్యూట్ నేతలకే దక్కాయన్నమాట.

ఇలా చేరి.. అలా టికెట్

బీజేపీ ప్రకటించిన 15 మంది అభ్యర్థులలో బీబీ పాటిల్ (జహీరాబాద్), పీ భరత్ (నాగర్‌కర్నూల్), శానంపూడి సైదిరెడ్డి(నల్లగొండ), సీతారాంనాయక్ (మహబూబాబాద్), గోడెం నగేశ్ (ఆదిలాబాద్), గోమాస శ్రీనివాస్ (పెద్దపల్లి) బీజేపీ కండువా ఇలా కప్పుకొని అలా టికెట్లు పొందినవారే. హైదరాబాద్ అభ్యర్థి మాధవీలత విషయం మరీ ఆశ్చర్యకరం. అభ్యర్థిగా ప్రకటించిన తర్వాత ఆమె బీజేపీ తీర్థం పుచుకున్నారు. తాను ఆరెస్సెస్ వాదినని ఆమె చెప్పుకుంటున్నప్పటికీ బీజేపీ నేతలు మాత్రం ఆమెను పారాచ్యూట్ నేతగానే భావిస్తున్నారు. మిగిలిన వరంగల్, ఖమ్మం టికెట్లలో వరంగల్ స్థానం బీఆర్ఎస్ నుంచి వచ్చి పార్టీ తీర్థం పుచ్చుకున్న అరూరి రమేశ్‌కు ఖరారైనట్టు తెలిసింది. ఖమ్మం టికెట్‌ను జలగం వెంకట్రావు ఆశిస్తుండగా, ఆ స్థానం తమకు ఇవ్వాలని టీడీపీ పట్టుబడుతున్నట్టు సమాచారం. జలగం అయినా, టీడీపీ అభ్యర్థి అయినా ఇద్దరూ 'ఇన్‌స్టంట్' నేతలే నన్న ప్రచారం జరుగుతున్నది.

వాళ్లను కూడా లెక్కిస్తే..

వాస్తవానికి బీజేపీ సిద్ధాంతాలు పూర్తిగా అర్థమై, దానికి అనుగుణంగా నడుచుకోవాలంటే సంఘ్ నుంచి వచ్చిన నేతలకో లేదా బీజేపీలో దశాబ్దాల నుంచి పనిచేస్తూ పైకి ఎదిగిన నేతలకో మాత్రమే సాధ్యం అవుతుంది. ఈ లెక్కన చూస్తే ప్రస్తుతం ప్రకటించిన అభ్యర్థుల్లో మొదటి నుంచీ బీజేపీనే నమ్ముకొని పార్టీలో కొనసాగుతున్నది కిషన్‌రెడ్డి, బండి సంజయ్, ధర్మపురి అర్వింద్ మాత్రమే. అర్వింద్ కుటుంబ నేపథ్యం కాంగ్రెస్ అయినా 2018లో ఆయన బీజేపీలో చేరి రాజకీయ ప్రస్థానం ప్రారంభించారు. మిగతావారు మాత్రం రెండుమూడేండ్లుగా పార్టీలోకి వచ్చి కొనసాగుతున్నవారే. వీరిలో డీకే అరుణ, రఘునందన్‌రావు, ఈటల రాజేందర్, బూర నర్సయ్యగౌడ్ వంటివారు ఉన్నారు. పార్టీలో చేరినప్పటికీ వీరంతా ఇప్పటికీ పార్టీలో పూర్తిగా కలిసిపోలేకపోతున్నారన్న విమర్శలున్నాయి.

మా పరిస్థితి ఏమిటి?

బీజేపీలో అసమ్మతి సెగలు రేగుతున్నాయి. బయటి నుంచి వచ్చిన వారికే టిక్కెట్లు కేటాయిస్తే పరిస్థితి ఏమిటని నేతలు వాపోతున్నారు. ఇన్నాళ్లూ తీవ్ర విమర్శలు చేసిన బీఆర్ఎస్ ఎంపీలు, మాజీ ఎమ్మెల్యేలు బీజేపీలో చేరగానే ఎంపీ టికెట్లు ఇవ్వడం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. నల్లగొండ టికెట్‌ను శానంపూడి సైదిరెడ్డికి ఇవ్వొద్దని జిల్లా నేతలు పలువురు విజ్ఞప్తి చేశారు. టికెట్ ఇవ్వనందుకు మేడ్చల్ జిల్లా బీజేపీ అధ్యక్షుడు పన్నాల హరీశ్‌రెడ్డి ఏకంగా పార్టీకి రాజీనామా చేశారు. సీనియర్ నేత మురళీధర్‌రావు, మల్కా కొమురయ్య, వీరేందర్‌గౌడ్, సురేశ్ రెడ్డి, కూన శ్రీశైలంగౌడ్, సామ రంగారెడ్డి.. తదితర నేతలంతా టికెట్ ఆశించారు. వీరిలో ఇద్దరుముగ్గురు నేతలు పక్క పార్టీ వైపు చూస్తున్నట్టు సమాచారం. హైదరాబాద్ టికెట్ మహిళకు కేటాయించడంపై రాజాసింగ్ మండిపడిన సంగతి తెలిసిందే. మాజీమంత్రి బాగారెడ్డి కుమారుడు జైపాల్‌రెడ్డికి, ఆలె నరేంద్ర కుమారుడు భాస్కర్‌కు కాకుండా పారాచూట్ నేతకు ఇవ్వడం ఏంటని నిలదీస్తున్నారు. నాగర్‌కర్నూల్ టికెట్‌ను బంగారు లక్ష్మణ్ కుమార్తె బంగారు శ్రుతి ఆశించగా భరత్‌కు అప్పటికప్పుడు పార్టీ కండువా కప్పి టికెట్ ఇవ్వడం తీవ్ర అసంతృప్తికి దారితీసింది. మహబూబ్‌నగర్ టిక్కెట్ డీకే అరుణకు కేటాయించగానే జితేందర్‌రెడ్డి కాంగ్రెస్‌లో చేరారు. మెదక్ నుంచి టికెట్ ఆశించిన అంజిరెడ్డిని పక్కనబెట్టి రఘునందన్‌రావుకు మరో అవకాశం ఇవ్వడం చర్చనీయాంశమైంది.

ఖమ్మం సీటుపై 'బాబు' కన్ను!

- తెలంగాణలోనూ బీజేపీతో టీడీపీ పొత్తు?
- ఖమ్మం సీటు కోరుతున్న చంద్రబాబు
- అభిష్టానం కూడా ఇచ్చేందుకే మొగ్గు!
- తీవ్రంగా వ్యతిరేకిస్తున్న కిషన్‌రెడ్డి

హైదరాబాద్, మార్చి 18 (నమస్తే తెలంగాణ): తెలంగాణలో మళ్లీ అడుగుపెట్టేందుకు టీడీపీ అధినేత చంద్రబాబు విశ్వప్రయత్నాలు చేస్తున్నారు. ఆంధ్రప్రదేశ్‌లో బీజేపీతో జట్టుకట్టి ఎన్నికల సమరంలో దిగుతున్న చంద్రబాబు, తెలంగాణలోనూ బీజేపీతో పొత్తుకు తహతహలాడుతున్నారు. బీజేపీతో ఎలానూ పొత్తుపెట్టుకున్నాం కాబట్టి అది తెలంగాణకూ వర్తిస్తుందని, ఖమ్మం సీటు తమకు కేటాయించాలని ప్రతిపాదన తీసుకొచ్చినట్టు సమాచారం. ఖమ్మంలో తమకు మంచి క్యాడర్ ఉందని చెప్పిన చంద్రబాబు.. కులసమీకరణ పరంగా చూసుకున్నా గెలిచే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని, కాబట్టి ఆ సీటును ఇవ్వాలని డిమాండ్ చేసినట్టు తెలిసింది. చంద్రబాబు ప్రతిపాదనను ఢిల్లీ పెద్ద లు కూడా సీరియస్‌గా తీసుకుని లెక్కలు వేస్తున్నట్టు సమాచారం. ఖమ్మంలో టీడీపీకి టికెట్ ఇస్తే, గ్రేటర్ హైదరాబాద్‌లో ఆ ప్రభావం కనిపిస్తుందని, ఓటు బ్యాంకు పెరిగే అవకాశం ఉన్నదని భావిస్తున్నదట.

ప్రతిపక్షాలకు అస్త్రం

బీజేపీ ఇప్పటి వరకు 15 సీట్లకు అభ్యర్థులను ప్రకటించగా వరంగల్, ఖమ్మం మాత్రమే పెండింగులో ఉన్నాయి. రెండు రోజుల క్రితం బీజేపీలో చేరిన అరూరి రమేశ్‌కు వరంగల్ టికెట్ ఇవ్వడం ఖాయమన్న ప్రచారం జరుగుతుండగా, మిగిలిన ఖమ్మం సీటును టీడీపీకి ఇవ్వాలని బీజేపీ అధిష్ఠానం కూడా యోచిస్తున్నట్టు చెబుతున్నారు. ఈ నిర్ణయాన్ని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి సహా సీనియర్లు వ్యతిరేకిస్తున్నట్టు సమాచారం. బాబుతో పొత్తును ఏపీకే పరిమితం చేయాలని, టీడీపీకి ఖమ్మం స్థానాన్ని ఇవ్వడం ద్వారా ఇతర పార్టీలకు లక్ష్యంగా మారొద్దని సూచించినట్టు తెలిసింది. కొందరు నేతలు మాత్రం ఈ ప్రతిపాదన వల్ల బీజేపీ కొంత లాభపడే అవకాశం ఉన్నదని చెప్తున్నారట. ఎలాగూ ఇతర పార్టీల నుంచి వచ్చిన నేతలకే టికెట్లు ఇస్తున్నప్పుడు అదేదో టీడీపీకే ఇస్తే రాష్ట్రవ్యాప్తంగా క్యాడర్ బలం పెరుగుతుందని సలహా ఇస్తున్నారట. చర్చలు ఫలించి టీడీపీకి ఖమ్మం టికెట్ కేటాయిస్తే, అదే స్థానం నుంచి టికెట్ ఆశించి పార్టీలో చేరిన జలగం వెంకట్రావు పరిస్థితి ఏమిటన్న చర్చ పార్టీలో మొదలైంది.

మొండి బకాయిదారులపై మున్సిపల్ కొరడా

పన్ను చెల్లింపులో నిర్లక్ష్యం వహిస్తున్న మొండి బకాయిదారులపై నిర్మల్ మున్సిపాలిటీ అధికారులు కొరడా ఝుళిపించారు. ఇప్పటికే రెడ్ నోటీసులను జారీ చేసిన అధికారులు.. నిర్మల్ పట్టణంలోని ప్రియదర్శినినగర్ కాలనీ, గాజులపేట కాలనీల్లో సోమవారం పన్నుల వసూలుకు వెళ్లారు. రెండు కాలనీల్లోని ఆరు ఇండ్ల యజమానులు పన్నులు చెల్లించడం లేదు. దీంతో రెవెన్యూ అధికారి అనూప్‌కుమార్ ఆధ్వర్యంలో సిబ్బంది ఆరు ఇండ్ల గేట్లను జప్తు చేసి ట్రాక్టర్లలో తీసుకెళ్లారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ శ్రీనివాస్, బిల్ కలెక్టర్ ఆడె దినేశ్ ఉన్నారు.

-నిర్మల్ చైన్‌గేట్

విద్యార్థుల మెస్‌చార్జీలు వెంటనే చెల్లించాలి

ఎంపీ, బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్ కృష్ణయ్య

హైదరాబాద్, మార్చి18 (నమస్తే తెలంగాణ): హాస్టల్ విద్యార్థుల 10 నెలల మెస్‌చార్జీల బకాయిలను వెంటనే విడుదల చేయాలని ఎంపీ, బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్ కృష్ణయ్య రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు సీఎం రేవంత్‌రెడ్డికి సోమవారం కృష్ణయ్య బహిరంగ లేఖ రాశారు. 10 నెలలుగా మెస్ బిల్లులు చెల్లించకపోవడంతో హాస్టళ్లకు సరఫరా చేసే నిత్యావసరాలను వ్యాపారులు నిలిపివేశారని, దీం